క్యాంపు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించిన జుక్కల్ ఎమ్మెల్యే

నిజాంసాగర్, డిసెంబర్17: జుక్కల్ మండలకేంద్రంలోని క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆదివారం పరిశీలించారు. త్వరలో ప్రజా దర్బార్ నిర్వహించనుండడంతో క్యాంపు కార్యాలయాన్ని సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో చిన్న చిన్న మరమ్మతులను పూర్తిచేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు అస్పత్‌వార్ వినోద్, విఠల్‌రావ్‌పటేల్, గణేశ్‌పటేల్, ఇమ్రాన్‌ఖాన్ ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

వేడుకల్లో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పిట్లం, డిసెంబర్ 17: మండలంలోని పోతిరెడ్డిపల్లి స్కూల్‌తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు కొనసాగాయి. వేడుకలను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరై పూజలు చేశారు. సేవాలాల్ మహరాజ్, భవానీమాత కృపతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సంతోషంగా జీవించాలని వేడుకున్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, గిరిజన నాయకులు ఉన్నారు.

చల్ల గాలులతో జాగ్రత్త

ఎల్లారెడ్డి, డిసెంబర్ 17 : వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చల్ల గాలులు వీస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచుతోపాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంటున్నదని తెలిపారు. చలి కారణంగా పిల్లలు, వృద్ధులు త్వరగా అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్స్ వస్తున్నాయని తెలిపారు. ఆస్తమా, దగ్గు, దమ్ము ఉన్నవారు పూర్తిగా వెచ్చటి వాతావరణంలో ఉండాలని, సమస్య ఎక్కువగా ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా మహా పడిపూజ

పిట్లంలో అయ్యప్ప విగ్రహానికి అభిషేకం చేస్తున్న తొగుట పీఠాధిపతి మాధవానందస్వామీజీ

ఎల్లారెడ్డి/పిట్లం, డిసెంబర్ 17 : పిట్లం మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, పడిపూజ కొసాగాయి. కార్యక్రమానికి తొగుట పీఠాధిపతి మాధవానందస్వామి హాజరై భక్తి ప్రవచనాలు బోధించారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని, 41 రోజుల మాలధారణలో పాటించిన నియమాలను జీవితాంతం అవలంబించాలని సూచించారు. ఇతరులకు సహాయపడినప్పుడే మానవ జన్మ సార్థకం అవుతుందని తెలిపారు. మహా పడిపూజ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలు, పూలతో అందంగా అలంకరించారు.

పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే షిండే

పిట్లం మండలకేంద్రంలో నిర్వహించిన మహాపడిపూజా కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప దీక్ష ఎంతో ప్రత్యేకమైనదని, సన్మార్గం వైపు వెళ్లేందుకు దోహదపడుతుందని అన్నారు. తనను మూడుసార్లు గెలిపించి 15 ఏండ్లపాటు సేవచేసే అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. గెలిచినా, ఓడినా ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. అనంతరం షిండేను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, భగవాన్, బొడ్ల రాజు, నర్సాగౌడ్, అయ్యప్ప మాలధారులు, గ్రామపెద్దలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం పడిపూజ నిర్వహించారు. పట్టణంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన గురు స్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో మాలధారులతోపాటు భక్తులకు అన్నదానం, భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురు స్వాములు చంద్రం, శ్రీనివాస్, హన్మంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో పడిపూజ చేస్తున్న మాలధారులు

పిట్లంలో నిర్వహించిన పడిపూజా మహోత్సవంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షిండే

విజయ డెయిరీ ఆధ్వర్యంలో పాడి పశువుల పంపిణీ

సదాశివనగర్, డిసెంబర్ 17 : విజయ డెయిరీ అడ్లూర్ ఎల్లారెడ్డి బీఎంసీ పరిధిలోని టేక్రియాల్, అడ్లూర్ ఎల్లారెడ్డి, లింగంపల్లి గ్రామాలకు చెందిన పాడి రైతులకు ఆదివారం పశువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఎంసీ మేనేజర్ యాడారం రమేశ్ చారి మాట్లాడుతూ.. ముద్ర పథకంలో భాగంగా రైతులకు రూ. 2లక్షల చొప్పున రుణాలను మంజూరు చేయించి పశువులను అందజేశామని చెప్పారు. టేక్రియాల్ గ్రామానికి చెందిన రైతులకు 14 బర్రెలు, రెండు ఆవులు, అడ్లూర్ ఎల్లారెడ్డిలో 8 బర్రెలు, లింగంపల్లిలో 8 బర్రెలను అందజేశామని చెప్పారు. డెయిరీలో పాలు పోసిన రైతులకు 15 రోజులకోసారి డబ్బులు చెల్లిస్తున్నామని తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకులో ప్రతినెలా రూ.4వేల చొప్పున వాయిదాలు కట్టాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో టేక్రియాల్ కార్యదర్శి రాజేశ్, టేక్రియాల్ అధ్యక్షుడు నరేశ్, రైతులు రాజేశ్వర్ కుమార్, సాయిలు, సుధాకర్, సాయిలు, రాజయ్య, పోచయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బర్రెలను అందిస్తున్న అడ్లూర్ ఎల్లారెడ్డి బీఎంసీ మేనేజర్ రమేశ్

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 17: ఎల్లారెడ్డి మండలంలోని గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 18 నుంచి జనవరి 6వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక కోసం ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 180042545678 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

లోలెవల్ వంతెన కుంగి.. వ్యాన్ బోల్తా

గాంధారి, డిసెంబర్ 17: వాగుపై ఉన్న లోలెవల్ వంతెన కుంగడంతో వాహనం బోల్తాపడిన ఘటన మండలంలోని గుజ్జుల్‌తండా సమీపంలో చోటుచేసుకున్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుజ్జుల్ వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో లోలెవల్ వంతెనకింద ఉన్న మట్టి కోతకు గురైంది. మండలంలోని బీర్మల్ తండాకు చెందిన వెంకటి శనివారం తన డీసీఎం వ్యాన్‌లో మక్కలు నింపుకొని గాంధారి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌కు సైడ్ ఇవ్వడం కోసం తన వాహనాన్ని వంతెన చివరకు మళ్లించాడు. మక్కలతో ఉన్న వ్యాన్ బరువుకు వంతెన ఒక్కసారిగా కుంగిపోవడంతో, వాహనం వాగులోకి బొల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

గుజ్జుల్ వాగులో బోల్తాపడిన వ్యాన్

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

రాజు (ఫైల్)

గుండెపోటుతో ఉపసర్పంచ్ మృతి

గాంధారి, డిసెంబర్ 17: మండలంలోని రాంలక్ష్మణ్‌పల్లి గ్రామ ఉప సర్పంచ్ వల్లకొండ రాజు శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుకు శుక్రవారం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స కోసం కామారెడ్డి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. అందరితో కలివిడిగా ఉండే రాజు మృతి చెందడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజు భార్య కొన్ని రోజుల క్రితమే మరణించగా, వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అంత్యక్రియలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే జాజాల

రాంలక్ష్మణ్‌పల్లి గ్రామ ఉప సర్పంచ్ వల్లకొండ రాజు అంత్యక్రియలను శనివారం స్వగ్రామంలో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్.. అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. రాజు అంత్యక్రియల్లో గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్, విండో చైర్మన్ పెద్దబూరి సాయికుమార్, మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ముస్తఫా, సర్పంచ్ రాధాబాయి రాంచందర్‌రావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.